సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం : 30 : మార్చి : 2023



శ్రీరామనవమి శోభ
నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి సందర్భంగా శబరి శ్రీరామక్షేత్రంలో గురువారం జరిగే సీతారాముల కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రాము)	రూ.5,471
3 శాతం జీఎస్టీతో	రూ.5,635
సవర (8 గ్రా)	రూ.45,080

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.0 /26.12

బుధవారం గాలిలో 70 శాతం తేమ ఉంది. గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశముంది.



లైసెన్స్‌లు సగం మందికే..

నిబంధనలను గాలికొదిలేస్తున్న వాహనదారులు

- వాహన రికార్డులు లేకుండానే రోడ్లపైకి..
- మైనర్లకు బైక్‌లు ఇచ్చి చోద్యం చూస్తున్న తల్లిదండ్రులు
- ట్రాఫిక్ నిబంధనలను పాటించని వైనం
- రెన్యువల్ చేసుకోవడంపైనా నిర్లక్ష్యమే

వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సివస్తోంది. లైసెన్స్‌లు లేకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారిపై రవాణా శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మార్పు తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా వాహనదారుల తీరు మారకపోగా వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. పోలీసు, రవాణా శాఖ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప లైసెన్స్ తీసుకోవడం, ట్రాఫిక్ రూల్స్ పాటిద్దామన్న ఆలోచనే ఉండడం లేదు.

నెల్లూరు(టౌన్): ప్రజలు వాహనాల కొనుగోలులో చూపించిన ఆసక్తి లైసెన్స్‌లు తీసుకోవడంలో ఉండడం లేదు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ ద్విచక్ర, లైట్ మోటార్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. లైసెన్స్‌లు లేకుండా, నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం వల్ల నిత్యం జిల్లాలో పలు ప్రమాదాలు చోటుచేసుకుని పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ఎక్కాలంటే లైసెన్స్‌తోపాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి అన్న ఆలోచనను విస్మరిస్తున్నారు. ప్రధానంగా లైసెన్స్ లేకుండానే యువతతోపాటు మైనర్లు రోడ్లపై బైకులతో రయ్ రయ్ మంటూ దూసుకుపోతున్నారు. ఓ వైపు పోలీసు, రవాణా శాఖ అధికారులు రహదారులపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నా తప్పించుకుని పోయేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప లైసెన్స్ తీసుకోవడంతోపాటు ట్రాఫిక్ రూల్స్ పాటిద్దామన్న ఆలోచనే ఉండడం లేదు. ఈ నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకుని కన్నవారికి గుండెకోత మిగులుస్తూ భారీ మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికైనా లైసెన్స్ లేని, నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.


వాహన రికార్డులు పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారులు (ఫైల్)

తల్లిదండ్రులే స్వయంగా..
పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ పేర్లతో మైనర్లయిన పిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులే స్వయంగా రోడ్లపైకి పంపుతున్నారు. ప్రధానంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే ప్రమాదం జరిగినా కనీసం ఇన్సూరెన్స్ కూడా రాదు. ఈ విషయం తెలిసినా వాహనదారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో వాహనాలున్న వారిలో సగం మందికి కూడా లైసెన్స్‌లు లేవు. వాహనాల సంఖ్యను ఒకసారి పరిశీలిస్తే 28,632 హెవీ, మీడియం లారీలు, 7,244 మూడు చక్రాల గూడ్స్ వాహనాలు, 58,739 ఆటో రిక్షాలు, 26,302 కమర్షియల్ ట్రాక్టర్లు, 32,357 అగ్రికల్చర్ ట్రాక్టర్లు, 59,364 కార్లు, 6,24,958 మోటారు సైకిళ్లు, 32,357 ఆలిండియా, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లున్నాయి. వీటితోపాటు పలు రకాల వాహనాలు కూడా ఉన్నాయి. అయితే రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న వారిలో అధికంగా లైసెన్స్ లేని వారినే రవాణా, పోలీసు శాఖల అధికారులు గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలు, లైసెన్స్‌లపై ప్రతి ఏటా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఎల్ఎల్ఆర్ మేళా, రహదారి భద్రతా వారోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్, మితి మీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, ఓవర్ లోడ్ తదితర వాటిపై జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో..
ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల సంఖ్య : 8 లక్షలకు పైగా..

లైసెన్స్‌లు ఉన్న వాహనదారులు :	4,13,524
గతేడాది ఏప్రిల్ నుంచి నమోదైన కేసులు :	19,867
వసూలైన అపరాధ రుసుము : రూ. 19 కోట్లు	

జరిమానా విధిస్తున్నా..


డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తూ.. (ఫైల్)

లైసెన్స్‌లు లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై రవాణా శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీగా జరిమానాలు విధిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మొత్తం 19,867 కేసులు నమోదు చేశారు. వాటిలో లైసెన్స్ లేని వారిపై 3,307, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 60, ఓవర్ స్పీడ్‌కు సంబంధించి 7,026, ఓవర్ లోడ్‌కు సంబంధించి 1,509, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడపగా 92, రేడియం స్టిక్కర్లపై 1,100, హెల్మెట్ లేని వాహనదారులపై 520, ప్యాసింజర్‌కు సంబంధించి 111 ఇంకా అనేక వాటి మీద కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం రూ.19 కోట్లు జరిమానాల రూపంలో వసూలు చేశారు. రానున్న రోజుల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి లైసెన్స్ లేని, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, ఆపోజిట్ డైరెక్షన్ నడపడం, ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోంటామని రవాణా అధికారులు హెచ్చరిస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే జైలే..



మైనర్లకు వాహనాలు ఇచ్చి పట్టుబడితే తల్లిదండ్రులకు జైలు శిక్ష ఉంటుంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానాతోపాటు పదిరోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ రెండు, మూడు ప్రాంతాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. – బి.చందర్, డీటీసీ

సుస్థిర అభివృద్ధి సాధించేందుకు కృషి

- సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం
- ప్లానింగ్ శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్


మాట్లాడుతున్న విజయ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లా సుస్థిర అభివృద్ధి సాధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ శాఖ కార్యదర్శి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల హెచ్‌ఓడీలు, ప్రధాన బాధ్యులతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారంపై వర్క్‌షాపును బుధవారం నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ధనిక, పేదల మధ్య తీవ్రస్థాయిలో ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఐక్యరాజ్యసమితి మిలీనియం సమీకృత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించిందన్నారు. పేదరికం, ఆకలిని నివారించి ఆరోగ్యం, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన తాగునీరు లాంటి లక్ష్యాల సాధనకు ప్రపంచవ్యాప్తంగా 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు పేదరికం అడ్డంకిగా మారిందని యూనిసెఫ్ గుర్తించిందన్నారు. పేదరికాన్ని తగ్గించేందుకు పలు సూచికలు ఇచ్చినట్లు చెప్పారు. వాటికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఆకలిని పారదోలాలన్నారు. విద్య, లింగ సమానత్వం, పౌష్టికాహారం, శిశు, గర్భిణుల మరణాలు, వ్యాధులు, కాలుష్యం, పరిశ్రమలు, కనీస అవసరాలు తీర్చడం, అవినీతి నిర్మూలన, సమన్యాయం, సమానత్వం తదితర అంశాలపై వివరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇది ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. జిల్లాలో అందిన అన్ని శాఖల అర్జీలను గడువులోగా పరిష్కరించారని, ఇందుకు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ఎస్పీ విజయారావును అభినందిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయాల ద్వారా..
కలెక్టర్ మాట్లాడుతూ మొదటి నుంచి నెల్లూరు జిల్లా గుడ్ గవర్నెన్స్‌కు పెట్టింది పేరన్నారు. ప్రజలను, ప్రభుత్వాన్ని మమేకం చేస్తూ జిల్లాలో ఎందరో అధికారులు చెరగని ముద్ర వేశారన్నారు. అలాంటి వారిలో ఎస్ఆర్ శంకరన్ ప్రతి అధికారికి స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలో 725 సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందుతున్నాయన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సూచికలో ముందుండేలా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, అడిషనల్ ఎస్పీ హిమవతి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, సీపీఓ సాల్మాన్‌రాజు, తహసీల్దార్లు, డాక్టర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు పనులపై ప్రత్యేక దృష్టి

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణ పనులపై చర్యలు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కరికాల వలవన్, కలెక్టర్ చక్రధర్‌బాబు

కందుకూరు: రామాయపట్నం పోర్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో పనుల్లో మరింత వేగం పెంచేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి పోర్టు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పునరావాస కార్యక్రమాలను వేగంగా చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అటవీ భూముల అనుమతులు సాధించి త్వరగా పోర్టు అధికారులకు అప్పగించాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూములను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి భూసేకరణకు కృషి చేయాలని చెప్పారు.

భూసేకరణ పూర్తి చేయాలి
రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా గుడ్లూరు మండలం తెట్టు వద్ద ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్మాణంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కరికాల వలవన్ అన్నారు. దీనికి సంబంధించి తెట్టు వద్ద ఇప్పటికే గుర్తించిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎ.చంద్రశేఖర్, ఏపీఐఐసీ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి, సబ్ కలెక్టర్ శోభిక, కావలి ఆర్డీఓ శీనానాయక్, రామాయపట్నం పోర్టు అభివృద్ధి సంస్థ ఎండీ ప్రతాప్‌రెడ్డి, జీఎం నరసింహారావు, ఓఎస్డీ ఐవీ రెడ్డి, ఏపీఏడీఏ సీఈఓ నీరజ్, తహసీల్దార్ సీతారామయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సోమశిలలో 54.892 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 54.892 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 369 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 700 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.185 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

సమాచార, పౌర సంబంధాల శాఖ డీడీ బదిలీ
నెల్లూరు(అర్బన్): జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరప్రసాద్‌ను మచిలీపట్నం డీడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలో పనిచేస్తూ సెలవులో ఉన్న సదారావు నెల్లూరు జిల్లా డీడీగా బదిలీ అయ్యారు.

రేపు ఐఏబీ సమావేశం
నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం శుక్రవారం జరుగుతుందని ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30కు కలెక్టర్ చక్రధర్‌బాబు అధ్యక్షతన నెల్లూరులోని నూతన జెడ్పీ కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. రెండో పంటకు సోమశిల ప్రాజెక్టు నుంచి సాగునీరు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు సలహా మండలి సభ్యులు హాజరుకావాలని కోరారు. రైతు సంఘాల నాయకులు గంట ముందే సమావేశానికి విచ్చేసి సూచనలు తెలియజేయాలని కోరారు.

మూడునెలలు.. 398 సవర్లు

'దొంగతనాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టండి. పాతనేరస్తులతోపాటు జైలు నుంచి విడుదలైన వారి కదలికలపై నిఘా ఉంచండి. వాహన తనిఖీలు ముమ్మరం చేయండి. దొంగతనాల కట్టడితోపాటు చోరీ సొత్తు రికవరీపై దృష్టి సారించండి' అని పదేపదే జిల్లా పోలీస్ బాస్ హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా కొందరు సిబ్బంది పనితీరులో మార్పురాకపోవడం దొంగలకు కలిసొస్తోంది.

- రెచ్చిపోతున్న దొంగలు
- వృద్ధులే లక్ష్యంగా దోపిడీలు
- కొందరు పోలీసుల తీరుపై విమర్శలు
- ఎస్పీ ఆదేశాలను పట్టించుకోని వైనం

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పోలీస్ గస్తీ తగ్గుముఖం పట్టింది. దొంగలు అందినకాడికి దోచేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా చోరీలకు తెగబడుతున్నారు. పగలు రెక్కీ చేస్తున్నారు. ఆ సమయంలో తాళం వేసిన ఇల్లు కనిపిస్తే రాత్రి వెళ్లి దోచేస్తున్నారు. ఒంటరి వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. మూడునెలల వ్యవధిలో దుండగులు సుమారు 398 సవర్ల బంగారు ఆభరణాలను, ఇంకా నగదు, వజ్రాలు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. దీంతో కొందరు పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 54 పోలీసుస్టేషన్లు, 12 సర్కిల్స్ ఉన్నాయి. వాటి పరిధిలోని ఏదో ఒక ప్రాంతంలో రోజూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. చోరీల నియంత్రణలో కొందరు పోలీసులు నామమాత్రం చర్యలకు పరిమితమయ్యారనే విమర్శలున్నాయి. గతనెలలో బాలాజీనగర్‌లో ఓ వృద్ధురాలిని చంపుతామని బెదిరించి సుమారు ఎనిమిది సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లగా.. రెండురోజుల క్రితం నాగేంద్రనగర్‌లో ఇల్లు అద్దెకు కావాలని ఇద్దరు యువకులు ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలిపై దాడిచేసి సుమారు మూడున్నర సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. దీనిని బట్టి చూస్తే పక్కాగా రెక్కీవేసి దోపిడీలకు పాల్పడుతోన్నట్లు తెలుస్తోంది. ఇటీవల నెల్లూరులో ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి ఒంటిపైనున్న ఆభరణాలు దోచుకెళ్తున్నారు. ఇక రౌడీషీటర్లు కత్తులు చూపించి చంపుతామని బెదిరించి అందినకాడికి దోచుకున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు


బాలాజీనగర్‌లో దోపిడీకి గురైన వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీస్ (ఫైల్)

- న్యూ మిలటరీ కాలనీలో తండ్రి, కుమార్తెను నిర్బంధించి పదిన్నర సవర్ల బంగారు, రూ.4.50 లక్షల సొత్తు చోరీ చేశారు.
- బీవీనగర్‌లో కృష్ణంరాజు అనే వ్యక్తి ఇంట్లో 28 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.80 వేలు, 1,300 గ్రాముల వెండి వస్తువులు అపహరించారు.
- కోవూరులో బి.సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇంట్లో దొంగలు సుమారు 40 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.3.5 లక్షల నగదును అపహరించుకెళ్లారు.



చర్యలు అంతంతమాత్రమే
దొంగతనాలను కట్టడి చేయాలని ఎస్పీ విజయారావు ప్రతి సమావేశంలో చెబుతూనే ఉన్నారు. అయితే కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో పలువురి పనితీరు అంతంతమాత్రంగానే ఉంటోంది. శివారు ప్రాంతాల్లో, లాడ్జీల్లో దుండగులు మకాంవేసి యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. గతనెలలో ఓ వ్యక్తి లాడ్జీలో ఉంటూ రెక్కీ వేసి విశ్రాంత అధికారి ఇంట్లో చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. రోజూ సాయంత్రం 5 నుంచి ఏడు గంటల వరకు నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగ్ కేవలం వాహనదారులపై ఫైన్లకే పరిమితమైందన్న ప్రచారం ఉంది.

సీసీఎస్ ఎక్కడ?
జిల్లాలో చోరీలు.. దోపిడీలు ఎక్కడ జరిగినా సీసీఎస్ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి ఎవరు చేశారు? ఏ ముఠా ఈ తరహా నేరాలకు పాల్పడే అవకాశం ఉందని వెంటనే చెప్పేవారు. రోజుల వ్యవధిలోనే కేసులను ఛేదించేవారు. జిల్లా సీసీఎస్‌కు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. గతేడాది అనేక క్లిష్టతరమైన కేసులను ఛేదించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నేరాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు


నెల్లూరులో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. కాగా వచ్చేనెల 4వ తేదీ వరకు బ్రిడ్జి కోర్సులకు సంబంధించి పరీక్షలు జరుగుతాయి. ఈనెల 15 ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 55,909 మంది విద్యార్థులు హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 12 మందిని అధికారులు డిబార్ చేశారు. చివరిరోజు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పలు పరీక్షలను నిర్వహించారు. జనరల్‌కు సంబంధించి 24,785 మందికి గానూ 24,171 మంది హాజరయ్యారు. 614 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 621 మందికి గానూ 569 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ఎగ్జామ్స్ ముగియడంతో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఏపీ ఎంసెట్, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పలు పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కానున్నారు. కొంతమంది ఇళ్లకు పయనమయ్యారు. ఇంటి దగ్గరే చదివి పరీక్షకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నగదు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం
నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు, వారి కోచ్‌లకు భారత ప్రభుత్వం అందించే నగదు పురస్కారాన్ని పొందేందుకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సెట్నెల్ సీఈఓ పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 సంవత్సరం ఆగస్టు 11వ తేదీకి ముందు జరిగిన అర్హత గల క్రీడాంశాలకు సంబంధించి నగదు అందని వారికి అందించేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ యొక్క డీబీటీ – ఎంఐఎస్ పోర్టల్లో https://dbtyas-sports.gov.in నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు
నెల్లూరు(వీఆర్సీసెంటర్): శ్రీరామనవమి పండగ సందర్భంగా గురువారం సెలవు దినమైనా జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేయనున్నాయని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఇంటికి బయలుదేరుతూ..


నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థుల సందడి

హుషారుగా ఇంటిబాట

రోజూ పుస్తకాలతో కుస్తీ పట్టిన ఇంటర్ విద్యార్థులకు ఉపశమనం లభించింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు బుధవారం ముగియడంతో పరీక్ష కేంద్రాల వద్దే విద్యార్థులు హుషారుగా కేరింతలు కొట్టారు. గురువారం శ్రీరామనవమి కూడా ఉండడంతో పండగను ఇంటి వద్దే జరుపుకొనేందుకు లగేజీలతో ఇంటిబాట పట్టారు. దీంతో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద విద్యార్థుల కోలాహలం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


సెల్ఫీ టైమ్


కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

ప్రత్యేకావసరాల పిల్లలకు రూ.53.13 లక్షలు

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి వారి తల్లిదండ్రుల అకౌంట్లలో రూ.53.13 లక్షలు జమచేసినట్లు సమగ్రశిక్ష సహిత విద్య కో–ఆర్డినేటర్ ధనమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 1,173 మంది దివ్యాంగ బాలికలకు ఉపకార వేతనం రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.23.46 లక్షలు, ప్రత్యేక అవసరాలు కలిగిన 375 మంది విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద రూ.3 వేలు చొప్పున రూ.11.25 లక్షలు, తీవ్ర, అతి తీవ్ర మేధా వైకల్యం కలిగి పాఠశాలలకు వెళ్లలేని 363 మంది పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్ కింద రూ.3 వేల చొప్పున రూ.10. 89 లక్షలు, కండరాల కదలికలు లేని పిల్లలు, బుద్ధి మాంద్యం కలిగిన పిల్లలకు సహిత విద్య రీసోర్స్ ఉపాధ్యాయులు ఇంటి వద్దకే వెళ్లి బోధన అందిస్తారు. అలాంటి 251 మందికి గృహ ఆధారిత విద్య అలవెన్స్ కింద రూ.3 వేలు చొప్పున రూ.7.53 లక్షలను గత రెండు రోజుల నుంచి ఆయా అకౌంట్లలో జమ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యం

- ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలైన గడప గడపకు మన ప్రభుత్వం, పేదలందరికీ ఇళ్లు తదితరాల్లో ప్రజల ఇబ్బందులను గుర్తించి తొలి ప్రాధాన్యతక్రమంలో పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌భవన్‌లో ఆయన జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఫీజ్ ఆఫ్ కాల్స్ (ఎఫ్‌టీసీ) వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, 33 కేవీ, 11 కేవీ విద్యుత్ ఫీడర్లలో పీఎంపీ(ప్రీ మన్‌సూన్ ఇన్‌స్పెక్షన్) నిర్వహించాలని అధికారులను ఆదేశించామన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ కచ్చితంగా చేయాలని, ఫిబ్రవరి నెలాఖరు వరకు నమోదు చేసుకున్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేశామన్నారు. వ్యవసాయ సర్వీసులు ఇచ్చేందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు మెటీరియల్ స్టోర్స్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సంబంధించి రైతుల ఫోన్ నంబర్, ఆధార్ నంబర్‌ను లింక్ చేయాలని సూచించారు. ఎస్ఈతో పాటు విద్యుత్‌శాఖ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోడూరు బిట్–2 సచివాలయ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం మంత్రి చేపట్టారు. పంచాయతీ పరిధిలోని పాత పట్టపుపాళెం, రవీంద్రపురం, రాజీవ్‌కాలనీ, కొత్త పట్టపుపాళెం, నడిమి పట్టపుపాళెం, ఈదర్లవారిపాళెం, వెంకటేశ్వర పట్టపుపాళెం, కొత్తకోడూరు, ఎద్దలరేవు సంఘం గ్రామల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రూ.4 వేలు ఇచ్చి చేతులు దులుపుకుందని, ఈ ప్రభుత్వంలో మత్స్యకార భరోసా కింద రూ.10 వేలను అందిస్తోందన్నారు. వేట సమయంలో మరణిస్తే గతంలో ఇస్తున్న రూ.5 లక్షలను రూ.10 లక్షలగా పెంచినట్లు పేర్కొన్నారు. వేటకు వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని పాతపట్టపుపాళేనికి చెందిన మత్స్యకారులు తన దృష్టికి తీసుకురాగా రూ.8 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేత కావల్‌రెడ్డి రంగారెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు కావలిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, కె.రవీంద్రరెడ్డి, కె.సురేంద్రనాథ్‌రెడ్డి, కె.దిలీప్‌రెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, ఎం.బుజ్జిరెడ్డి, ఎ.శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీ నీలమ్మ, మాజీ జెడ్పీటీసీ ఎం.చిరంజీవులగౌడ్ పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

ఎవరికి వారే..

- నిలువునా చీలిన నెల్లూరు టీడీపీ
- జిల్లా కార్యాలయంలో కుమ్ములాట

నెల్లూరు (టౌన్) : నెల్లూరు నగరంలో తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఎవరికి వారే అన్నచందంగా జరిగింది. దీంతో ఆ పార్టీలోని వర్గ విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. నగరంలోని నర్తకి సెంటర్‌లో బుధవారం టీడీపీ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం ఆ పార్టీ నగర అధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి నగర ముఖ్యనేతలెవరూ హాజరు కాలేదు. ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమం నిర్వహించడంతో ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. కాగా రూరల్ నియోజకవర్గ పరిధిలోని మూలాపేటలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నగర నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో పాటు అజీజ్, ఇతర నాయకులు వేడుకలు నిర్వహించారు. అదే విధంగా జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు హాజరైన నాయకులు కుమ్ములాటకు దిగారు. రూరల్ నియోజకవర్గ పరిధిలో ఓ డివిజన్‌లోని నాయకుల మధ్య విబేధాలు ఒకరిపై ఒకరు చేయిచేసుకునే స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ఓ మహిళా నేతను తోసేశారు. ఇటీవలే టీడీపీలో అంతా తామైనట్లు చేరిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గానీ అయన అనుచరులు గానీ ఈ వేడుకల్లో ఎక్కడా పాల్గొనకపోవడం చర్చకు దారి తీసింది.

వైద్య వృత్తికి ప్రత్యేక గౌరవం


కాన్వొకేషన్ అందుకుంటున్న విద్యార్థిని


మాట్లాడుతున్న అతిథులు

- కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్) : సమాజంలో వైద్య వృత్తికి ప్రత్యేక గౌరవం ఉందని, కొత్తగా డాక్టర్ వృత్తిలోకి వస్తున్న వారు రోగులను ప్రేమగా ఆదరించి వైద్యం అందించాలని కలెక్టర్ చక్రధర్‌బాబు సూచించారు. నగరంలోని దర్గామిట్ట వద్ద ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసుకున్న డాక్టర్లకు కాన్వొకేషన్ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కలెక్టర్ హాజరై, మాట్లాడారు. పవిత్ర వైద్య వృత్తిలో పేద రోగులను ఆదుకోవడం, వారికి నాణ్యమైన వైద్యం అందించడం డాక్టర్ల బాధ్యత అని తెలియజేశారు. అనంతరం పలువురికి డాక్టర్ పట్టాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. 75 మంది విద్యార్థులు కాన్వొకేషన్‌లు పొందారు. అనంతరం వైద్య విద్యార్థులు తమ ఆట, పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్, ఏడీ ఏడుకొండలు, డాక్టర్లు మస్తాన్‌బాషా, కాశేషా, కళారాణి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)	
పెద్దవి	రూ.70
సన్నవి	రూ.60
పండ్లు	రూ.25



టీడీపీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్సార్‌సీపీకి చెందిన 40 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం కాదని, ఆ 40 మంది పేర్లు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్టీఆర్‌ను దించాలని రామోజీరావుతో పచ్చపత్రికలో ఎమ్మెల్యేలంతా తన వైపు ఉన్నారని చెప్పుకున్నారని, ప్రస్తుతం అదేలా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కూడా తనతో ఉన్నారని బాబు మైండ్‌గేమ్ ఆడుతున్నాడని దుయ్యబట్టారు. చంద్రబాబును నమ్మి ఎవరూ వెళ్లరని తెలిపారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అమ్ముడుపోగానే అందరూ వచ్చేస్తారనే భ్రమలో టీడీపీ ఉందని పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ తప్పనిసరి

- రాష్ట్రస్థాయి ఫ్లోర్ కర్లింగ్ పోటీలు ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ తప్పనిసరిగా రాణించాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు వేదాయపాళెంలోని ఎల్ఎల్ఎఫ్ స్కూల్లో మూడో రాష్ట్రస్థాయి ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే దేశానికి మంచి పేరు వస్తుందని, విద్యార్థులందరూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోందని, మహిళలకు సైతం ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు జాతీయ పోటీలకు ఎంపికవుతారని కర్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మనోహర్, రాష్ట్ర కర్లింగ్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, 28వ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

చేనేత రంగాన్ని కేంద్రం ఎలా ప్రోత్సహిస్తోంది?

నెల్లూరు(సెంట్రల్) : ఏపీలో చేనేత అభివృద్ధికి కేంద్రం ఏ విధంగా ప్రోత్సాహం అందిస్తోందని లోక్‌సభలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ సమాధానమిస్తూ విశాఖపట్నంలో వెయ్యి కుట్టు యంత్రాలతో టెక్స్‌టైల్ పార్క్ నడుస్తోందని, ఏపీలో 1.78 లక్షల మంది కార్మికులు చేనేతపై ఆధారపడి ఉన్నారని సమాధానమిచ్చారు. ఉక్కు పరిశ్రమల ఏర్పాటులో చిన్న పరిశ్రమలకు అవకాశం ఉందా అని ఆదాల మరో ప్రశ్న వేశారు. స్పందించిన సంబంధిత మంత్రి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారితో పాటు ఉక్కు తయారీదారులతో ప్రభుత్వం విస్తృతమైన సంప్రదింపులు జరిపిందని తెలిపారు.

ఉపాధి హామీ సమస్యలపై చర్యలేవి?

నెల్లూరు(సెంట్రల్) : ఉపాధి హామీ పథకం కార్మికులు ఢిల్లీలో ధర్నా చేయడం వాస్తవమేనా, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని రాజ్యసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కేంద్రమంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి సమాధానమిస్తూ రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థన మేరకు కొన్ని సవరణలు చేశామని, వీటితో పాటు ఫొటో అప్‌లోడ్‌కు సంబంధించి కొన్ని సమరణ చేశామని సమాధానమిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- మృతుడు బద్వేలు వాసి

మర్రిపాడు : మండలంలోని సింగనపల్లి అటవీ సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. స్థానికుల సమాచారంతో తొలుత అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం ఫొటోలను వైఎస్సార్, నెల్లూరు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు పంపారు. కాగా బద్వేల్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు నమోదైనట్లు గుర్తించారు. సదరు కుటుంబీకులకు తెలియజేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తమ వారిదేనని నిర్ధారించారు. దీంతో మృతుడు వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలం నందిపల్లి గ్రామానికి చెందిన మన్నెం బలరామిరెడ్డి (73)గా గుర్తించారు. ఇటీవల ఆయనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇక్కడకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడి ఉంటొచ్చని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఘటనా స్థలంలో విషపు గుళికలు కూడా ఉండడంతో వాటిని తిని మృతిచెంది ఉండొచ్చని పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మర్రిపాడు పోలీసులు తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు			
బ్రాయిలర్ (లైవ్)	121	బ్రాయిలర్ చికెన్	212
లేయర్ (లైవ్)	75	బ్రాయిలర్ స్కిన్‌లెస్	236
		లేయర్ చికెన్	128